ప్రజాశక్తి

శనివారం 28 డిసెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పేదలకు మరోసారి నిరాశ

జన్మభూమి సభలకు మంగళం - కొత్త పింఛన్లు, రేషన్ కార్డులకు మోక్షం ఎప్పుడు?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జన్మభూమి 2.0 నిర్వహణపై ప్రభుత్వం వెనుకడుగు వేసింది. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలు నిరాశకు గురయ్యారు. ప్రధానంగా నూతనంగా పింఛన్లు కావాలని కోరుకుంటున్న వారు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలకు కావాల్సిన వారికి జన్మభూమి సభల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని ఆశించారు. జనవరి రెండు నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి సభలు నిర్వహించాలని మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. జన్మభూమి సభల నిర్వహణలోపు పింఛన్ల పరిశీలన పూర్తిచేయాలని, అనర్హులను తొలగించాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అంతేగాక జన్మభూమి గ్రామ సభల్లోనే కొత్తగా రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వ వర్గాలు చెబుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో

ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో జన్మభూమి ప్రధాన ఏజెండాగా ఉంటుందని అధికారులంతా భావించినా అనూహ్యంగా ఏజెండాలో ఈ అంశాన్ని చేర్చలేదు. కలెక్టర్ల నుంచి ఈ అంశంపై ప్రస్తావనా రాలేదు. జన్మభూమి 2.0 ఉంటుందా? లేదా? అని కూడా ఎవ్వరూ అడగలేదు. ప్రభుత్వమూ స్పష్టత ఇవ్వలేదు.

చంద్రబాబు ఎప్పుడు సిఎంగా ఉన్నా జన్మభూమి నిర్వహణకు తొలి ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రతి ఏటా జనవరి, అక్టోబరులో నిర్వహించే వారు. ఈసారి కూడా అలాగే నిర్వహించాలని యోచించారు. కానీ జన్మభూమి సభలకు వచ్చే విజ్ఞాపనల పరిష్కారానికి నిధుల కొరత ఉన్నందున ప్రస్తుతానికి జన్మభూమి నిర్వహణను విరమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిధుల కొరత వెంటాడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఆరు నెలలుగా ఎదురుచూస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటికి తమకు అందుతాయని పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ఉచిత బస్సు, డిఎస్‌సి పోస్టుల భర్తీ, కానిస్టేబుల్స్ ఎంపిక ప్రక్రియలన్నీ ▶ 2లో

స్మార్ట్ మీటర్ల సిబ్బందితో మాట్లాడుతున్న నళినీకాంత్, తదితరులు

మా కార్యాలయంలో స్మార్ట్‌మీటర్ వద్దు

సిపిఎం ఆఫీసులో స్మార్ట్ మీటర్లను అడ్డుకున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును శుక్రవారం ఆ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించటానికి వచ్చిన సిబ్బందిని సిపిఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకొని, వెనక్కి పంపించారు. ప్రజలపై భారాలు మోపే స్మార్ట్‌మీటర్లను అంగీకరించబోమని నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలూ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల అంగీకారం లేకుండా, వారికి తెలియకుండా మీటర్లు బిగించటానికి ఏ అథారిటీ ఉందని ప్రశ్నించారు. దీంతో సిబ్బంది అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కె.నళినీకాంత్, విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ షేక్.అబ్దుల్‌సలీమ్ మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, ఇంధన సర్దుబాటు ఛార్జీలు పేరుతో ఇప్పటికే ప్రజలపై భారాలను మోపారని, ఇవి చాలవన్నట్లు గంటకొక రేటు నిర్ణయించి వసూలు చేయటానికి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజల నుండి ఛార్జీలు వసూలు చేస్తుందన్నారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్‌కు అయ్యే ఖర్చును కూడా ప్రజల నుండే వసూలు చేస్తారన్నారు. విద్యుత్ భారాలు, సంస్కరణల విషయంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలు రెండూ ఒకటేనని, ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.లక్ష్మణరావు, షేక్.ఖాశిం షహీద్, జి.లూథర్‌పాల్, షేక్ ఖాశింవలి పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద ఆటోవాల నిరసన

పెంచిన ఫీజుల రద్దు, నెలవారీ పాసుల కోసం డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

టోల్గేట్ ఫీజులను పెంచుతూ వాహనదారులపై భారాన్ని మోపుతున్న ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్), సిఐటియు ఆధ్వర్యంలో కాజా టోల్ ప్లాజా వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆటో వర్కర్లు, యజమానులు, ఓలా, ఊబర్, రాపిడో వాహనదారులు కాజా టోల్ ప్లాజా వద్దకు ర్యాలీగా చేరుకొని నిరసన తెలిపారు. ఫీజులు తగ్గించాలని, నెలవారి పాసులను గత పద్ధతిలోనే జారీ చేయాలని, ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు నగదు చెల్లించాలనే కొత్త నిబంధనను ఎత్తివేయాలని, స్థానికులకు పాసులను ఇవ్వాలని డిమాండ్ ▶ 2లో

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ డిసెంబర్ 29న స్థానిక ఎన్‌జిఒ కళ్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయటంలో పిడిఎఫ్ ▶ 2లో

గుంటూరులో విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

విద్యుత్ బాదుడుపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి, పల్నాడు జిల్లా

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వైసిపి శ్రేణులు శుక్రవారం పోరుబాట చేపట్టాయి. ఇందులో భాగంగా నిరసన ప్రదర్శనలతోపాటు విద్యుత్ కార్యాలయాలు ఎదుట వారు ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలిచ్చారు. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని గుజ్జనగుండ్ల పలకలూరు రోడ్డు సబ్ స్టేషన్ వద్ద వైసిపి నాయకులు ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. తూర్పు నియోజకవర్గంలోని విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద నియోజకవర్గం ఇన్‌ఛార్జి నూరిఫాతిమా, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. గృహ ▶ 2లో

హర్షిల్ కిరణ్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నారాయణ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న హర్షిల్ కిరణ్ తీసిన ఛాయాచిత్రాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. హర్షిల్ తీసిన పలు పక్షులు, అటవీ జంతువుల ఛాయాచిత్రాలను కలెక్టర్ పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. హర్షిల్ కిరణ్‌కు జాతీయ స్థాయిలో వచ్చిన బంగారు పతకాలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హర్షిల్ తండ్రి నెల్లూరు జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజిగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హర్షిల్‌ను అభినందిస్తున్న కలెక్టర్

నేడు రేపు పల్నాడు బాలోత్సవం

- ఏర్పాట్లు పూర్తి - ప్రారంభించనున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే
- 65 అంశాల్లో నైపుణ్య ప్రదర్శనకు 10 వేలమందికి పైగా విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించే పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-2 ఏర్పాట్లు ▶ 2లో

నరసరావుపేటలో నిరసన ప్రదర్శన

సిఎం పర్యటన ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సామాజిక పింఛన్ల పంపిణీ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నరసరావుపేట మండలం యలమంద గ్రామంలో ఈనెల 31న పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్డిఒ కె.మధులత, టిడిపి రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. సభ వేదిక సమీపంలోని హెలికాప్టర్ ల్యాండింగ్‌కు స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు, ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. సభా స్థలి, ప్రాంగణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని కోరుతూ శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ర్యాలీని ఎస్‌పి సతీష్‌కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాద మరణాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్‌పి ఈ సందర్భంగా వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా మరణించకుండా తృటిలో తప్పించుకోవచ్చునని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి జివి రమణమూర్తి, హనుమంతు, ట్రాఫిక్ డిఎస్‌పి రమేష్, సిఐలు పాల్గొన్నారు.

గ్రామకంఠాల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని గ్రామాల్లో దీర్ఘకాలంగా ఆ పరిష్కృతంగా ఉన్న గ్రామకంఠాల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తుళ్లూరు కు చెందిన రైతు జమ్ముల శ్రీనాథ్,ఎ సుబ్బారావు, రాజేష్ మరికొండరు రైతులు తుళ్లూరు సి ఆర్ డి ఎ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డే లో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం,అధికారులు గ్రామకంఠాల సమస్యను పూర్తిగా పరిష్కరించకుండా రైతులను అయోమయంలో పెట్టిందని వినతిపత్రం లో పేర్కొన్నారు.సి ఆర్ డి ఎ అధికారులు కొందరు గ్రామకంఠాల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం రైతులను ఇబ్బందులకు గురిచేసిందని విన్నవించారు.అసంబద్ధంగా గ్రామకంఠాల కేటాయింపు కారణంగా రైతులు అనేక సందర్భాల్లో తమ అభ్యంతరాలను ప్రభుత్వం, అధికారుల ముందుంచారని, అయినా సహేతుకమైన నిర్ణయం జరగలేదని వాపోయారు. గ్రామకంఠాల కేటాయింపు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా జరిగిందని,కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఈపూరు : బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యతని జిల్లా బాలల రక్షణ అధికారి బి.శౌరి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి, ఎఎన్ఎం, గ్రామ సచివాలయ సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. శౌరి మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ చట్టాల గురించి వివరించారు. తహశీల్దార్ ఎ.నళిని మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సిడిపిఒ బి.అరుణ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం, ఆహారం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావం, పరిశుభ్రత లైంగిక వేధింపుల నుండి రక్షణ, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్య ఉపాధి అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపిడివో కె.ప్రభాకర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి బాలికాభివృద్ధి కోసం పనిచేయాలన్నారు.

కారణం లేకుండా తొలగింపు.. జీతాలూ పెండింగ్

ఎపిఎంకు వినతిపత్రం ఇస్తున్న విఒఎలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - దాచేపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటీసులేమీ ఇవ్వకుండానే తమను తొలగించారని, పనిచేసిన కాలానికిసైతం వేతనాలు ఇవ్వలేదని విఒఎలు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో ఎపిఎం రవికి శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించడం, జీతాలనూ చెల్లించకుండా కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఇప్పటికే వినతిపత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. విధుల నుంచి తొలగించిన వారిని కోర్టు ఆర్డర్ ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మండలంలోని రూరల్ గ్రామాల్లో 20 మందికి గాను 18 మంది విఒఎలను తొలగించారని, వారికి వేతనాలు ప్రభుత్వం మంజూరు చేసినా స్థానిక ఎంపిఎం ఇవ్వకుండా సాకులు చెబుతున్నారని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే మండల సమైక్య కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. దీనిపై ఎపిఎం వివరణిస్తూ విఒఎలకు ఆరునెలల జీతాలు రావాల్సి ఉండగా మూడు నెలల జీతాలే విడుదలయ్యాయని తెలిపారు. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సుమతి, హైమావతి, శైలజ, మల్లేశ్వరి, అనంతలక్ష్మి, అచ్చయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు వివేకానంద విద్యాసంస్థలలో శుక్రవారం శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పెదకూరపాడు, తాళ్లూరు, పరస, ఖమ్మంపాడు, జలాల్పురం, అత్తలూరు, అబ్బరాజుపాలెం గ్రామాల నుండి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. హాజరైన వారిలో 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శిరీష, ఏవో వీర్రాజు కంటి క్యాంపు నిర్వాహకులు నెలకుదుటి గోపి, వీరభద్రరావు పాల్గొన్నారు.

పేదలకు మరోసారి నిరాశ

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కాక 50ఏళ్ల నిండిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామన్న హామీలపై రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఈ పథకాలతో పాటు గతేడాది ఆగస్టు నుంచి నూతన రేషన్ కార్డుల జారీ, కొత్త పింఛన్ల మంజూరు నిలిచిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా వీటిపై స్పష్టత ఇవ్వడం లేదు. కొత్తగా రేషన్ కార్డులు, నూతన పింఛన్ల జారీపై ఈనెల 2వ తేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునంటూ గత నెలలో సోషల్ మీడియాలో ప్రచారమైంది. ప్రభుత్వం ఖండించలేదు. అలాఅని వీటికి సంబంధించిన ఆదేశాలు ఇవ్వలేదు.

ప్రధానంగా సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవడంతో పింఛన్లు, రేషన్ కార్డులు ఆశిస్తున్న వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జన్మభూమిలో దరఖాస్తులు స్వీకరిస్తారని టిడిపి వర్గాల్లో ప్రచారం జరిగింది. కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ రాలేదు. 2023 డిసెంబరు తరువాత కొత్త కార్డులు, పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. తరువాత ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ కార్డులు, పింఛన్లపై ఇంత వరకు మార్గదర్శకాలు విడుదల కాలేదు. కొత్త పింఛన్లకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎటువంటి ఆదేశాలు రాలేదు. గతంలో రేషన్ కార్డుల కోసం గత ఏడాది డిసెంబరు వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి నంబర్లు కూడా కేటాయించారు. కానీ ఆ తరువాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది వరకు ఉన్నారు. వీరి దరఖాస్తులు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చినా ఇంతవరకు మోక్షం లేదు. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకు ఏడాది కాలంలో నూతనంగా వివాహం చేసుకున్న వారు, ఒంటరి మహిళలు, ఇతర తరగతుల వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేక ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

గతేడాది రేషన్ కార్డులు లేకపోవడం వల్ల నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేదు. కార్డుల్లోని కొంతమంది కుటుంబ సభ్యులు మరణిస్తే వారి పేరున కార్డు వుంటే వారు ఈకేవైసీ చేస్తే కానీ ఇతర సదుపాయాలు ఏవీ అందకపోవడం వల్ల రేషన్ కార్డుల్లో తదుపరి కుటుంబ పెద్దల పేరున మార్చడానికి కూడా ఇంత వరకు తగిన మార్గదర్శకాలు రాలేదు. కొత్త పింఛన్లకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల దాదాపు 17 నెలలుగా అర్హులైన పేద వర్గాల వారు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 60 ఏళ్ళు దాటిన వృద్దులు, భర్తను కోల్పోయిన వితంతువులు, ప్రమాదాల్లో వైకల్యానికి గురైన వారు పెద్ద సంఖ్యలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 50 ఏళ్ల దాటిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. ఎప్పటికి వస్తాయన్నదీ ప్రశ్నార్థకమైంది.

టోల్‌గేట్ వద్ద ఆటోవాల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ టోల్గేట్ ఫీజులో పెంపు కేవలం వాహన యజమానులు పైనే కాదని ప్రజలందరికీ భారమేనని చెప్పారు. టోల్గేట్ ఫీజుల వసూలు భారతదేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా భావించవచ్చన్నారు. ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్ పై 8 శాతం సెస్‌ను కేంద్రం రోడ్డు టాక్స్ పేరుతో వసూలు చేస్తోందని, మళ్లీ ఈ టోల్ ఫీజులు ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఈ సెస్ రూ.3 ఉంటే బిజెపి అధికారంలోకి వచ్చాక రూ.8కు పెంచిందన్నారు. తాజాగా అక్టోబర్ నుండి ఫీజులు పెంచారని విమర్శించారు. స్థానికులకు ఫీజుల నుండి మినహాయింపు ఇవ్వాల్సి ఉన్నా అది జరగడం లేదన్నారు. నెలవారీ పాసులను విపరీతంగా పెంచారని, ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు గొడ్డలిపెట్టని అన్నారు. రోడ్డు వేసిన క్రమంలో స్థానికులు భూమిని కోల్పోతున్నారని, స్థానికులకు ఫీజు మినహాయింపు ఇవ్వాలనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాల్లేక ఆటోలు నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్న కార్మికులను టోల్ ఫీజుల బాదుడు అన్యాయమన్నారు. గతంలో టాటా ఏస్ ఆటోలకు ఒకసారి కడితే ఆ రోజంతా తిరిగే అవకాశం ఉండేదని, ప్రస్తుతం దాన్ని రద్దుచేసి ఎన్నిసార్లు తిరిగితే అన్ని సార్లు ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ భారత న్యాయ సంహిత 106 (1), (2)లను, జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ ఫీజులను తిప్పికొట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, తన్నీరు శ్రీరాములు, సిఐటియు నాయకులు జి.రామ్మోహన్‌రావు, టాటా మ్యాజిక్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు నవీన్ పాల్గొన్నారు.

నేడు రేపు పల్నాడు బాలోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయ్యాయని పల్నాడు బాలోత్సవం కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా వినూత్న అంశాలతో పల్నాడు బాలోత్సవం నిర్వహిస్తున్నామని, జయప్రదానికి అందరూ సహకరించాలని కోరారు. ప్రారంభోత్సవానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దేశభక్తి, అభ్యుదయ భావాలు పెంపొందించడంతో పాటు అంతరించిపోతున్న దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడేందుకు బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఇష్టమైన కళా రూపాలు ఆవిష్కరించుకునేలా వేదిక ఏర్పాటు చేశామని, 65 అంశాల్లో 10 వేల మందికి పైగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారని చెప్పారు. అత్యధికంగా 1500 మందికి పైగా విద్యార్థులు కోలాటం ప్రదర్శనకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

రేపు పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నారన్నారు. చట్ట సభల్లో ప్రజల గొంతుక వినిపించటానికి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మీయ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి బి.లక్ష్మణరావు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు సలీం, జెవివి నాయకులు వెంకట్రావ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఇ.అప్పారావు, బి.శ్రీనివాసరావు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ బాదుడుపై వైసిపి నిరసన

(మొదటి పేజీ తరువాయి)

వినియోగదారులపై మోపిన రూ.15,485 కోట్ల చార్జీల బాదుడ్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఛార్జీల పెంపును నిలిపివేయాలని, ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని, వ్యవసాయ పంపుసెట్లకు వెంటనే కనెక్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో అంబటి రాంబాబుతో పాటు మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వైసిపి కార్యాలయం నుండి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేసి డిఇకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2014లో కూడా చంద్రబాబు రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ హామీనిచ్చి విస్మరించారన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ఎగిరే విమానాలు, ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేస్తారేగాని కింద స్థాయిలో ఉన్న ప్రజల్ని పట్టించుకోరని ఎద్దేవ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు సైతం ఉచిత విద్యుత్ తీసేస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు మినహా మిగతా హామీలేవీ అమలు చేయలేదని, విద్యుత్ బిల్లులు మాత్రం భారీగా వడ్డిస్తున్నారని విమర్శించారు. నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరెడ్డి, పి.శివారెడ్డి, పి.చిట్టిబాబు, పి.రవీంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గర్భస్థ లింగనిర్ధారణ చట్టంపై 'డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ' సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు సందర్శించి తనిఖీ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. డియంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలోని 24 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని, కాని సదరు ఆపరేషన్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ కాలేదని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మొత్తం 296 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు వున్నాయని , వాటిలో 4 రెన్యువల్ రిజిస్ట్రేషన్ కొరకు , తొమ్మిది మాడిఫికేషన్ కోసం, ఒకటి రద్దు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే క్రొత్తగా మూడు స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని,వాటిని కమిటీ సభ్యులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయడం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిటీ క్రొత్త స్కానింగ్ సెంటర్లు , రెన్యువల్ , మాడిఫికేషన్, క్యాన్సిలేషన్‌ను ఆమోదం తెలిపింది. సమావేశంలో రెండవ అడిషనల్ జడ్జి డాక్టర్ వై.నాగరాజ, డాక్టర్ శార్వాణ్‌బాబు, డాక్టర్.సుజాత, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు నిరుపమానం

కాంగ్రెస్ కార్యాలయంలో సంతాప సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ భారత ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాల మరణానికి చింతిస్తూ అన్ని రాజకీయాల పార్టీ ల ప్రతినిధులతో శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో స్మారక సభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, డొక్కా మాణిక్య వర ప్రసాద్, పిసిసి ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్ కుమార్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లమ్మ రెడ్డి లక్ష్మణ్ రెడ్డి, బిఎస్‌పి నాయకులు సిహెచ్ వాసు, విసికె పార్టీ నాయకులు జయసుధ, కాంగ్రెస్ నాయకులు బిళ్ల సునీల్ తదితరులు మన్‌మోహన్ సింగ్‌కు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. దేశ ప్రధానిగా, ఆర్థిక వేత్తగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు పూర్తిస్థాయిలో మన్మోహన్ సింగ్ కృషి చేశారని వారు తెలిపారు.

మన్మోహన్‌కు పెమ్మసాని నివాళి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారి పార్థివదేహానికి ఢిల్లీలో గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం నివాళులర్పించారు. మాజీ ప్రధాని మతి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. 1991 దేశం సంక్షోభంలో ఉండగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో నిశ్శబ్ద మార్పులు తీసుకువచ్చిన ఆ ఆర్థికవేత్త సేవలు భారతదేశం ఎప్పటికీ మరువలేనివని ఈ సందర్భంగా పెమ్మసాని అన్నారు. మన్మోహన్ మృతికి మాజీ ఎంపి యలమంచిలి శివాజీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కలత చెందారు. మన్మోహన్ లేని లోటు పూడ్చలేనిదన్నారు. మన్మోహన్ సింగ్ మృతికి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సంతాపం తెలిపారు. ఆయన మరణం దేశ అభివృద్ధికి తీరని లోట న్నారు. మన్మోహన్ మృతికి ఎమ్మెల్యేలు జి.వి. ఆంజనేయులు, నజీర్ అహ్మద్, గల్లా మాధవి, పత్తిపాటిపుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

వర్సిటీ విసి గంగాధరరావు సంతాపం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిరస్మరణీయుడని నేటి యువతరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఇన్చార్జి విసి ఆచార్య కే .గంగాధర రావు సూచించారు. గురువారం మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప సభను శుక్రవారం డైక్మన్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

విద్యుత్ బిల్లులను తగలవేస్తున్న భవన నిర్మాణ సంఘాల నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, మీటర్ల మార్పిడి ఆపాలని కోరుతూ తెనాలి రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలి అన్నాబత్తుని పుర వేదిక వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నాయకులు కెబి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలపై వేస్తున్న విద్యుత్ అదనపు భారాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె రవికుమార్, షేక్ కరీముల్లా, ఎం పోతురాజు, ఎస్ బాల కోటేశ్వరరావు, కె సాంబయ్య, ఎల్ శ్రీనివాసరావు, వి జగదీష్, పి తిరుపతయ్య, ఎన్ హరి, ఎస్ రామారావు పాల్గొన్నారు.

తాడికొండలో మైనింగ్ అధికారుల విచారణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడికొండలో ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమంగా మైనింగ్ చేశారన్న ఆరోపణలపై గుంటూరు నుంచి వెళ్లిన ఆ శాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ అంశంపై పలువురు గ్రామస్తులు ఇటీవల విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. లోకేష్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు స్పందించారు. మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ సాయి కుమార్ ఆదేశాల మేరకు అధికారులు తాడికొండలో ప్రభుత్వ స్థలంలో గ్రావెల్ తవ్వకాలను పరిశీలించారు. అలాగే రెవెన్యూ అధికారులు కొంత మంది వైసిపి నాయకుల వద్ద భారీగా లంచాలు తీసుకుని జిల్లా పరిషత్, రెవెన్యూ, పోరంబోకు భూములను అక్రమంగా తమ స్వాధీనంలోకి తీసుకుంటున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని తాడికొండ టిడిపి నాయకులు బండ్ల కోటేశ్వరరావు, పాలడుగు సాంబశివరావు, కాళిశెట్టి రమేష్‌బాబు తదితరులు సిఎంకు, విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదులు చేసిన వారిలో ఉన్నారు. రెవెన్యూ అధికారుల అవినీతి,అలసత్వం, అక్రమాల వల్ల గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు వస్తున్నాయని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ ఫిర్యాదులో కోరారు.

మహారాజశ్రీ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నరసరావుపేట...

H.M ACT O.P 217/2024

Between:-
బొల్లు అప్పారావు ......పిటీషనర్
V/S
మల్లం - అలియాస్ బొల్లు నాగమణి.. రెస్పాండెంట్

పై కోర్టులో పై కేసును ఇందలి పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్ పై విడాకుల నిమిత్తమై దాఖలు చేయగా రెస్పాండెంట్ కు నోటీసులు పంపినను సర్వ్ కానందున గౌరవ శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్ నోటీసు నిమిత్తమై ఈ పేపర్ ప్రకటన ద్వారా ఆర్డర్ వేయగా వాయిదా ది.7-01-2025 కాగా, ఇందలి రెస్పాండెంట్ స్వయంగా లేక న్యాయవాది ద్వారా గాని సదరు కోర్టు వారి ఎదుట ది.7-01- 2025 న ఉదయం 10:30 ని.లకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల రెస్పాండెంట్ పరోక్షమున కేసు తీర్మానించబడును.

వాయిదా ది. 7-01-2025.

రెస్పాండెంట్ చిరునామా:-
మల్లం అలియాస్ బొల్లు నాగమణి
W/o బొల్లు అప్పారావు, D/o మల్లం రాములు, హిందువు, వయసు 25 ఏళ్ళు, R/o శ్రీ కృష్ణ దేవాలయం పక్కన, కొండపాటూరు గ్రామం కాకుమాను మండలం గుంటూరు జిల్లా.

ఇట్లు.
యం. ఆరోగ్యం చౌదరి,
యం,శ్రీనివాసరావు,
కె.వి.సుబ్రమణ్యం,
న్యాయవాదులు,
నరసరావుపేట.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...

OS No: 78/2023

Between:-
షేక్ అమీర్ భాష ..... వాది
మరియు
1.షేక్ నూర్ జహాన్ వగైరాలు ...ప్రతివాదులు
To,
D1) షేక్ నూర్ జహాన్ W/o కరిముల్లా D.No:162, స్ట్రీట్ నెం.226, వరవకట్ట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
D2) షేక్ షకీల W/o మస్తాన్ వలి, D.No:162, స్ట్రీట్ నెం. 226, వరవకట్ట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
D5) షేక్ హసీనా W/o నాగూర్ వలి D/o ఎలీషా D.No 16-37, R/o. పెద్ద తురకపాలెం గ్రామం, కేసనపల్లి పోస్ట్, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
D7) షేక్ ఖాసింబి W/o జాన్ R/o కొండవీడు గ్రామం, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.
D8) షేక్ షకీరా W/o ఇమామ్ హుస్సేన్ D.No: 249, స్ట్రీట్ 700, వినుగుల బజార్, నరసరావుపేట పట్టణం, పల్నాడు జిల్లా.

పై నెంబర్ దావాను వాది దావా పరిహారం పొందు నిమిత్తం వాది దావా దాఖలు చేసుకొని పైకోర్టు వారి నుండి ఇప్పటికీ అనేక పర్యాయములు దావా సమన్లు జారీ చేయించగా మీరు దావా సమన్లు తీసుకోని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం పై కోర్టు వారు ది.7-01-2025 న వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల దావా మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా ది.7-01-2025.

ఇట్లు.
బి.అనిల్ కుమార్,
వాది తరపు న్యాయవాది,
నరసరావుపేట.

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O S No 903/2023

బిట్వీన్
చొప్పరపు వెంకట రమాదేవి ....వాది
మరియు
కందకట్ల శ్రీనివాసరావు ...ప్రతివాది
టు
కందకట్ల శ్రీనివాసరావు తండ్రి గురు స్వామి, వ్యాపారం, డోర్ నెంబర్ 18-4-44, సత్తెనపల్లి పట్టణం మరియు మండలం, పల్నాడు జిల్లా.

పై నంబర్ గల దావాలో ప్రతి వాదికి శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు నోటీసులు జారీ చేసినను ప్రతివాది సదరు దావా సమన్లు మరియు ఐ.ఎ. నోటీసులు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టువారు ఐ.ఎ నెం 1963 /2023 మరియు O.S.No 903/2023 నందు ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా నీకు తెలియజేయ డమైనది. పై దావాలో మీ హాజరు నిమిత్తం తేదీ 28-01-2025 కి వాయిదా వేశారు.వాయిదా రోజున ఉదయం 10:30 నిమిషాలకు మీరు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయుచున్నది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా 28-01-2025

ఇట్లు
బగ్గి నరసింహారావు,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి.

IN THE COURT OF THE PRI' CIVIL JUDGE (SENIOR DIVISION) NARASARAOPET.

IA 331/2022 in IA 160/2019,
in
OS 78/2007

Smt: Dasari Rajyalakshmi (Died) and others ....Petitioners/plaintiff/ and proposed parties.
And
Nathani Bhargavanand and others.. ...respondents/Defendants /proposed properties.

To,
R1) Nathani Bhargavanand
S/o Ravindranath, D.No: 12-17-23/13/1 Prakash Nagar, Narasaraopet, Palnadu Dt.
R4) Boyapati Veeraiah S/o Ramaiah R/o Ponugotivaripaelm, H/o chittapuram, Ipuru (m) Palnadu Dist.
R5) Daruvuri Babu S/o Sivaiah, R/o Fair Burnpet, Palndu Dt.

పై నెంబరు వారసుల పిటిషన్ 331/2022 నెంబరు న శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్నిసార్లు పిటిషన్ మీద మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఈ దావా వ్యవహారం మీకు తెలిసి కూడా మీరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కనుక ఈ పేపర్ నోటీసు ద్వారా శ్రీ కోర్టు వారి ఎదుట ది. 20-01 2025 న ఉదయం 10:30 గం.ని లకు మీరు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా ది.20-01- 2025

NALLA PATI LAKSHMI NARAYANA,
Advocate
For Petitioners & Proposed parties.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం గ్రామం, దోరు నెం.4-184-48/1రు కాపురస్తురాలు షేక్ మస్తాన్‌వలి గారి భార్య షేక్ గౌస్యా, అను వారు సంజాయిషి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింట్ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తికి యాజమాని అయివున్నారు. నా క్లయింట్ సదరు ఆస్తికి సంబంధించిన దస్తావేజు అనగా శ్రీ మంగళగిరి సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.12767/2023రు మరియు ఇతర కాగితములను ఒక కవర్ నందు పెట్టుకొని జిరాక్స్ తీయించుకొను నిమిత్తము ఇంటి నుండి బయలుదేరి మంగళగిరి బస్టాండ్ వద్ద గల జిరాక్స్ తీయించుకొని వచ్చిన కవర్ మరియు అందులోని ఒరిజినల్ దస్తావేజులు, ఇతర కాగితములు కనబడియుండలేదు. వెంటనే సదరు ఒరిజినల్ దస్తావేజు గురించి చుట్టుప్రక్కల వెతికినను, విచారించినను సదరు దస్తావేజు దొరికియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనను దొరికిన యెడల, ఈ దిగువ తెలిపిన అడ్రస్సుకు స్వయముగా గాని, రిజిష్టరు పోస్టు ద్వారా గాని అందచేయగలరు. అట్లు గాన సదరు దస్తావేజు దొరికిన వ్యక్తి ఎవరైనను, వాటిని ఉపయోగించి ఎట్టి లావాదేవీలు జరిపినను అవి నా క్లయింటునకు బైండు చేయజాలవని మరియు అట్టి వారిపై నా క్లయింటు చట్టపరమైన చర్యలు తీసుకొనబడుననని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

షెడ్యూలు:-గుంటూరు డి॥ మంగళగిరి సబ్-డి యిలాకా తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన వడ్డేశ్వరం గ్రామం తాలూకు డి.నెం.45/3రు య.3.49 సెంట్లు మింజుమలె, వడ్డేశ్వరం గ్రామ 7వ బ్లాకు, దోరు నెం.7-38రు సమీపమున గల చ.గ.81.69లు స్థిరాస్తికి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.

తూర్పు:- కాట్రగడ్డ రామకోటేశ్వరరావు వగైరాల స్థలము హద్దు. అ.22.3లు
దక్షిణం:- కాట్రగడ్డ పిచ్చియ్య గారి స్థలము హద్దు. అ.33.0లు
పడమర:- అ.12లు వెడల్పు గల బజారు హద్దు. అ.22.3లు
ఉత్తరం:- కాట్రగడ్డ రామయ్య గారి స్థలము హద్దు. అ.33.0లు

ఈ హద్దుల మధ్య చ.గ.81.69లు లేక చ.మీ.68.30ల స్థలము మాత్రం.
కొలనుకొండ,
తేది:27-12-2024

కంచర్ల త్రినాథ్ కుమార్,
న్యాయవాది, కొలనుకొండ,
సెల్ నెం.99080 15980.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : ANANTAPUR

O.S.No.81/2018

Between:
M.Jaganmohan Chowdary,
S/o.M.Venkataramanappa, D.No.11-1-375,
Aravinda Nagar, Anantapuram Town
...Plaintiff
And
V.Pichaiah, S/o.V.Ramakotaiah,
R/o.Oppicherla Village, Karampudi
Mandal, Guntur District. ...Defendant

NOTICE TO THE DEFENDANT

To.
V.Pitchaiah, S/o.V.Ramakotaiah,
Major, resident of Oppicherla village,
Karampudi Mandal, Guntur District.

Please take notice that the Plaintiff has filed the above case for recovery of amount due under pro note and the same is posted to **20-01-2025** for your appearance. You are directed to appear before this Honble court on **20-01-2025 at 10-30 A.M.**, in person or through an advocate without fail, otherwise the matter will be dicide set exparte.

(By Order of the Court)

P.RAVINDRANATHA REDDY
Advocate for the Plaintiff
Anantapur. Cell: 9441074100.

IN THE COURT OF THE PRI' CIVIL JUDGE (SENIOR DIVISION) NARASARAOPET.

IA 330/2022 in IA 378/2014,
in
OS 78/2007

Smt: Dasari Rajyalakshmi (Died) and others .. petitioners/plaintiff/ and proposed parties.
And
Nathani Bhargavanand and others.. ...respondents/Defendants /proposed properties.

To,
R1) Nathani Bhargavanand
S/o Ravindranath, D.No: 12-17-23/13/1 Prakash Nagar, Narasaraopet, Palnadu Dt.
R4) Boyapati Veeraiah S/o Ramaiah, R/o Ponugotivaripaelm, H/o chittapuram, Ipuru (m) Palnadu Dist.
R5) Daruvuri Babu S/o Sivaiah, R/o Fair Burnpet, Palndu Dt.

పై నెంబరు వారసుల పిటిషన్ 330/2022 నెంబరు న శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్నిసార్లు పిటిషన్ మీద మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఈ దావా వ్యవహారం మీకు తెలిసి కూడా మీరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కనుక ఈ పేపర్ నోటీసు ద్వారా శ్రీ కోర్టు వారి ఎదుట ది.20-01-2025 న ఉదయం 10:30 గం.ని లకు మీరు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా ది.20-01- 2025.

NALLA PATI LAKSHMI NARAYANA,
Advocate
For Petitioners & Proposed parties.

విద్యుత్ బిల్లులపై వైసిపి పోరుబాట ప్రదర్శనలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పోరుబాట పేరుతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. విద్యుత్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలిచ్చారు. ఈ సందర్భంగా మాచర్ల పట్టణంలో వైసిపి జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాసం నుండి విద్యుత్ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులు భారీ ప్రదర్శన చేశాయి. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముందు విద్యుత్ బిల్లులు పెంచబోమని ఎన్నికలప్పుడు చెప్పిన కూటమి ఇప్పుడు రూ.15,485 కోట్లను ప్రజల నుండి వసూలు చేస్తోందని విమర్శించారు. సూపర్-6 పేరుతో ఇచ్చిన హామీలను వదిలేసి భారాలేస్తున్న ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. అనంతరం ఈఈ సింగయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.



ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాలలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయం నుండి ఏడీ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారం కోసం హామీలు గుప్పించి ఇప్పుడు విద్యుత్ భారాలు వేయడంతోపాటు ఇతర సంక్షేమ పథకాలనూ తుంగలో తొక్కారని విమర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.అశోక్ కుమార్, డి.రేవతి, కె.సాంబయ్య, కె.జాను, కె.వెంకటేశ్వర్లు, మురళీధర్‌రెడ్డి, గాంధీ, కె.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు స్థానిక వైసిపి కార్యాలయం నుండి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఎఇకి వినతి పత్రం ఇచ్చారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక వైసిపి కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులు ర్యాలీ అనంతరం ధర్నా చేశాయి. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణరెడ్డి, నాగుల్ మీరాన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వైసిపి శ్రేణులు నిరసన తెలిపి విద్యుత్ ఎఇకి వినతిపత్రం ఇచ్చారు. ఎంపిపి బి.మీరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినుకొండ

సత్తెనపల్లి

పెదకూరపాడు

ఎర్రజెండా ఆశయ సాధన కోసం తుదివరకూ ముస్తఫా కృషి

ప్రజాశక్తి - క్రోసూరు

సభలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ఎర్రజెండా ఆశయ సాధన కోసం తుది శ్వాస వరకు పనిచేసిన క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు ముస్తఫా అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్ అన్నారు. క్రోసూరుకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు షేక్ గండ్లూరు ముస్తఫా (ఎర్రజెండా ముస్తఫా) సంతాప సభ స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఆంజనేయులు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముస్తఫా చిత్రపటానికి విజయకుమార్ పూలమాలలేసి నివాళులర్పించి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడాలనే ఆశయంతో జీవితంలో చివరి వరకు ఎర్రజెండా పట్టుకుని పని చేయడం, చివరికి ఆ పేరునే తెచ్చుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఆవుల ఆంజనేయులు మాట్లాడుతూ ముస్తఫా దాదాపు 40 ఏళ్లకు పైగా సిపిఎంలో చేశారని, సమయపాలన కచ్చితంగా పాటించడంతోపాటు అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టిన నేపథ్యంలో మారుతున్న పరిస్థితులపై ప్రతిసమావేశంలోనూ ముస్తఫా ఆవేదన వ్యక్తం చేసేవారని, బిజెపి ప్రమాదం నుండి దేశాన్ని కాపాడుకోవడం కోసం పనిచేయటమే ముస్తఫాకు ఇచ్చే నివాళి అని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, క్రోసూరు గ్రామ శాఖ కార్యదర్శి చిల్కా ఏషియ్య, మైనార్టీ నాయకులు సత్తార్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం, సిపిఎం అభ్యున్నతికి ముస్తఫా చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. సభలో ఆర్.వెంకటేశ్వర్లు ఏపూరి వెంకటేశ్వర్లు, ఎం.పౌలు, జె.పేతురు, డి.ఇశ్రాయేలు, జి.మహేష్, ఎస్.సాంబయ్య, పి.రాజు, ముస్తఫా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి

ఉపాధి హామీ పనులపై నేటి నుండి సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉపాధి హామీ పనులపై శనివారం నుండి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో శుక్రవారం కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించిన ఎంపిడిఒ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి 31 వరకు 24 గ్రామ పంచాయతీల్లో రూ.15 కోట్లతో చేసిన 1500 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జరుగుతుందని తెలిపారు. తనిఖీ బృందాలకు ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమాచారం ఇచ్చి సహాకరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఆర్‌పి లోకేష్, పంచాయతీరాజ్ ఎఇ రామ్‌సింగ్, ఎపిఒ వెంకటనారాయణ, సామాజిక తనిఖీ డిఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కెసిపిలో ఘనంగా లక్ష్మణ దత్తు జయంతి

ప్రజాశక్తి - మాచర్ల

సభలో మాట్లాడుతున్న సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ

కెసిపి సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వెలగపూడి లక్ష్మణదత్తు 87వ జయంతిని మాచర్లలోని కెసిపి ఫ్యాక్టరీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఎస్ఆర్ ఆంజనేయులు 'ఐ' హాస్పిటల్ ఆధ్వర్యంలో కెసిపి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లక్ష్మణ్ దత్తు జయంతి ఉత్సవాలను ఫ్యాక్టరీ నాణ్యత ఉత్సవాలుగా ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిపి ఫ్యాక్టరీ జనరల్ సీనియర్ మేనేజర్ వి.వెంకటరమణ మాట్లాడుతూ కెసిపి సంస్థలను ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థలుగా తీర్చిదిద్దిన ఘనత లక్ష్మణ దత్తుకు దక్కుతుందని అన్నారు. సంస్థలలో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ క్వాలిటీకి కేరాఫ్ అడ్రస్‌గా కెసిపి సంస్థలను ఆయన నిలబెట్టారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అంకితభావంతో పనిచేస్తూ సంస్థలను అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కెసిపి సంస్థల్లో పనిచేసే ప్రతి కార్మికునికి, ఉద్యోగికి భరోసా కల్పిస్తుందని, నమ్మకం కలిగేలా యాజమాన్యాల పనితీరును లక్ష్మణ దత్తు మెరుగుపరిచారని అన్నారు. అనంతరం డ్రాయింగ్ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కెసిపి హెచ్ఆర్ అండ్ ఎస్‌జి శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు, అన్నివిభాగాల హెచ్ఒడిలు బి.శ్రీనివాసరావు, కె.రామకోటేశ్వరరావు, ఎస్.ప్రసాద్, సిఐటియు నాయకులు బి.మహేష్, ఐఎన్టీయూసీ నాయకులు జి.లక్ష్మీనారాయణ, జి.ప్రసాద్, పిఎస్ఆర్ కంటి హాస్పిటల్ డైరెక్టర్ చిరుమామిళ్ల కిష్టయ్య పాల్గొన్నారు.

పెండింగ్ చలనాలు చెల్లించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ద్విచక్ర వాహనదారుల పెండింగ్‌లో ఉన్న చలానాలను వెంటనే చెల్లించాలని నరసరావుపేట వన్‌టౌన్ సిఐ విజయ్‌చరణ్ సూచించారు. పట్టణంలో శుక్రవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నిబంధనలు మీరినప్పుడు పోలీసులు గుర్తించి పెనాల్టీ విధిస్తే వాహనదారుని ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, ఆ మొత్తాన్ని పోలీస్ యాప్ ద్వారా గాని, మీ-సేవ ద్వారా గాని చెల్లించవచ్చని అన్నారు. ఇటువంటి సందర్భాల్లో ఫేక్ మెసేజ్ వచ్చి తమను ఇబ్బందులకు గురి చేయవచ్చని వివరించారు. ప్రజలందరూ ఫేక్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో వన్‌టౌన్ ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల జాబితాలపై 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-ఈపూరు

షెడ్యూల్డ్ కులాల వారి కుల సర్వే జాబితా వివరాలను సంబంధిత సచివాలయాల్లో ప్రదర్శించామని తహశీల్దార్ నళిని శుక్రవారం తెలిపారు. సంబంధిత జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలుంటే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శికి 31 తేదీలోపు తెలపాలన్నారు. జనవరి ఆరో తేదీ వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, తుది జాబితాను జనవరి 10వ తేదీన సచివాలయాలలో ప్రదర్శిస్తామని చెప్పారు.

పిఎస్‌వికెలో రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్ వికె), డాక్టర్ ఎంవి రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని విజ్ఞానకేంద్రం కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య ప్రారంభిస్తారని, శిబిరంలో డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి, ముద్దం సృజన (లఘింశెట్టి) పాల్గొని కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని సత్తెనపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలేజీలో పరిశీలిస్తున్న మస్తిపురం రమేష్

ఏపీఆర్జేసీని సందర్శించిన తెలంగాణ ఐజి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎపిఆర్‌జెసి పూర్వ విద్యార్థి అయిన తెలంగాణ రాష్ట్ర ఐజీ మస్తిపురం రమేష్ శుక్రవారం విజయపురిసౌత్‌లోని కళాశాలను సందర్శించారు. 1987-89 బ్యాచ్‌కు చెందిన ఆయన సీఈసీ గ్రూప్‌లో కళాశాల టాపర్‌గా, రాష్ట్రంలో 9 స్థానంలో నిలిచారు. కుటుంబ సమేతంగా కళాశాలకు చేరుకున్న ఐజీకి ప్రిన్సిపాల్ సరోజిని ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఐజీ రమేష్ కళాశాలలో తిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఐజీ వెంట విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, సాగర్ ఎస్ఐ సంపత్ గౌడ్, హాలియా ఎస్ఐ వీరబాబు, అధ్యాపకులు హేమాంబర్‌రెడ్డి, లింగేశ్వరావు, సిహెచ్ చంద్రశేఖర్, డిప్యూటీ వార్డెన్ రత్నబాబు, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు ఉన్నారు.

గోదాములో పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ఇవిఎం గోడౌన్లలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం) గోడౌన్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయనవెంట జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్‌డిఒ కె.మధులత, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు ఉన్నారు.

ఛండీఘర్ విద్యుత్ పోరాటానికి సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు

చండీఘర్ డిస్కం విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టిన ఉద్యోగ కార్మికులకు ప్రజలు మద్దతుగా నిలవాలని సిఐటియు నాయకులు కోరారు. కార్మికార్మికుల పోరాటానికి మద్దతు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అదానితో కుదుర్చుకున్న అన్ని రకాల విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శంకర విలాస్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, కార్యదర్శి బి. లక్ష్మణరావు, విద్యుత్ వినియోగదారుల ఫోరం కన్వీనర్ మహమ్మద్ సలీం, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిస్కం అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కట్లకుంట శ్రీనివాసరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించే చర్యల్లో భాగంగా పాండిచ్చేరిలో ప్రైవేటీకరించారని, ఇప్పుడు ఛండీఘర్‌లో ప్రైవేటు పరం చేయటానికి సిద్ధమయ్యారన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతుందన్నారు. ఈనెల 31 నుండి నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధమయ్యారన్నారు. లాభాల బాటలో నడుస్తున్న డిస్కమును ప్రైవేటీకరణ చేపట్టేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. గతంలో ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లో ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉద్యోగులు, కార్మికులు తిప్పికొట్టారని గుర్తు చేశారు.మన రాష్ట్రంలో కూడా క్రమంగా ప్రైవేటుకు అప్పగించటానికే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు.

సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

సెకీ ఒప్పందంలో అదానీ అవినీతి ఉందని హిడెన్‌బర్గ్ నివేదిక బయటపెట్టినా అధికార, ప్రతిపక్షాలు నోరు మెదపట్లేదన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని చెప్పిన నారా లోకేష్ ఇప్పుడు వాటిని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. అదానీతో కుదుర్చుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సాంబ శివరావు, కె.నళినికాంత్, బైరగాని శ్రీనివాసరావు, ఎం ఏ చిష్టి, రమణ, కళ్యాణి పాల్గొన్నారు.

4వ తేదీకి గుంటూరు కౌన్సిల్ వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా శనివారం జరగాల్సిన గుంటూ రు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేసినట్టు మేయర్ కావటి మనోహర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న జరిగిన గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశానికి కొనసాగింపుగా రేపు 28వ తేదీ శనివారం జరగాల్సిన సాధారణ సమావేశం మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాల మృతి కారణంగా, కేంద్ర ప్రభుత్వం వారం పాటు సంతాప దినాలు ప్రకటించినందున 4వ తేదీకి వాయిదా వేశామన్నారు.

అర్జీలపై క్షేత్ర స్థాయిలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీల పరిష్కారం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ గారు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ గ్రీవెన్స్‌లో ప్రజల నుండి అందిన అర్జీల్లో నల్లచెరువు, బుడంపాడు ఎస్టీ కాలనీ, ఆర్టీసి కాలనీ, ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని గాయత్రి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అర్జీదారులతో మాట్లాడారు. సమస్యలపై అధికారులతో మాట్లాడారు. నల్లచెరువు ప్రాంతంలో పర్యటించి రోడ్లపై ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, నోటిసులు ఇచ్చి గడువు తర్వాత తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. బుడంపాడు ఎస్టీ కాలనీని పరిశీలించి, సదరు ప్రాంతంలో యుజిడి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, యుజిడి వలన కాలనీలో పలు సమస్యలు తీరుతాయని స్థానికులకు వివరించగా వారు అందుకు అంగీకారం తెలిపారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై కమిషనర్ కోరగా వెంటనే ఆయా పనులకు సంబందించిన అంచనాలను సిద్దం చేసి, తమ అనుమతి కోసం పంపాలని ఏఈని ఆదేశించారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని గాయత్రి నగర్ లో పారిశుధ్యం, డ్రైనేజి సమస్యలపై స్థానికుల అర్జీ మేరకు సదరు ప్రాంతాన్ని పరిశీలించి, ఆయా ప్రాంతాలు శివారు ప్రాంతాలుగా ఉండడం వలన ప్రాధాన్యత క్రమంలో అబివద్ధి పనులను చేపడతామని తెలిపారు. పర్యటనలో డిఈఈలు మధుసూధనరావు, రమేష్ బాబు, సతీష్‌కుమార్, డిసిపి చంద్రశేఖర్, టిపిఎస్ లక్ష్మణస్వామి, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్న ఖాసిం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ , గుంటూరు, పల్నాడు జిల్లా నాయకులు

సిపిఎం అభిమాని చిన్న ఖాసింకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సిపిఎం అభిమాని, మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి తండ్రి షేక్ చిన్న ఖాసిం అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. శుక్రవారం ఆయన స్వగ్రామం పొనుగుపాడులో నిర్వహించిన అంత్యక్రియల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ నివాళులర్పించి మాట్లాడుతు చిన్న ఖాసిం తన కుమారుడు మస్తాన్‌వలి ఉద్యమంలో పనిచేయడానికి ప్రోత్సహించాడని, కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందించారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, నాయకులు దండా లక్ష్మీనారాయణ, బైరగాని శ్రీనివాసరావు, బి లక్ష్మణరావు, బి రామకృష్ణ, జి రమణ, పల్నాడు జిల్లా సిపిఎం నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఆంజనేయులు నాయక్, ఎ లక్ష్మేశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, నాయకులు జి బాలకృష్ణ, కామినేని రామారావు, జి రజిని, డి శివకుమారి తదితరులు చిన్న ఖాసిం భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వర్సిటీ ఉద్యోగి డాక్టర్ కొండలరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

స్కోప్ ఫౌండేషన్ ద్వారా సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలు గుర్తింపుగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి. కొండలరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ వీసీ చాంబర్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఇన్చార్జి విసి ఆచార్య కే. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలం చేతులు మీదుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను డాక్టర్ కొండలరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రజల మధ్య సేవ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా నిరంతరం వారి అభ్యున్నతికి కొండలరావు అందిస్తున్న సేవలు గుర్తింపుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం యూనివర్సిటీకి గర్వకారణం అన్నారు. రెక్టర్ ఆచార్య కే . రత్న షీలా మణి మాట్లాడుతూ కొండలరావు రానున్న రోజుల్లో మరిన్ని పురస్కారాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగిగా విధులను నిర్వహించుకుంటూ నే పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్న కొండలరావు కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణివ్వాలి

జూడో పోటీలను ప్రారంభించిన శాప్ ఛైర్మన్ రవి నాయుడు

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం జూడో సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) చైర్మన్ ఏ. రవి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని క్రీడలకు సమప్రదాయం ఇస్తున్నట్లు పేర్కొన్నారు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారుల ఎంపిక మెరుగైన శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. మొత్తం 500 మంది క్రీడాకారులు జూడో టోర్నమెంట్కు తమ పేర్లు నమోదు

చేసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎన్. పవన్ సందీప్, సీఈవో నామిశెట్టి వెంకట్ లు పేర్కొన్నారు. 29వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సీనియర్ కాడెడ్, సబ్ జూనియర్ స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్ పాల్ కుమార్, గుంటూరు డిఎస్డిఓ పి. నరసింహారెడ్డి, జూడో అసోసియేషన్ కోశాధికారి టీవీవి. రమణ పాల్గొన్నారు.

ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు ఎస్టీ ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం 75వ ఆవిర్భావ (డైమండ్ జూబ్లీ) దినోత్సవం ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేట పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు మేడా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎస్‌హెచ్‌ఒ సమావేశ మందిరంలో ఆహ్వాన పత్రికల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర విశ్రాంత అధికారులు ఐఏఎస్ అధికారి మాట రామారావు, డిఐజి చౌటూరి వెంకటేశ్వర్లు, ఐఆర్ఎస్ అధికారి బి.సి.హెచ్.స్వామినాయక్, అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వరు ఆలిండియా షెడ్యూల్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ, రాష్ట్ర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. సమావేశానంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయ్యాల శ్యాంవరప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మొగిలి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కుంభా ముత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంభ వీరయ్య, మేడా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

చిత్రబృందంతో కళాశాల ప్రిన్సిపాల్

ఆర్‌విఆర్‌లో 'సకుటుంబనామ్' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో 'సకుటుంబనామ్' సినిమా ప్రమోషన్ టీం శుక్రవారం సందడి చేసింది. హెచ్‌ఎన్‌జి బ్యానర్ నిర్మాతలు హెచ్. మహాదేవ్‌గౌడ్, నాగరత్నలు కొత్తవారితో నిర్మించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా అని చిత్ర కథానాయకుడు రామ్‌కిరణ్ అన్నారు. తనపై నమ్మకం ఉంచి మంచి కథతో తీసిన చిత్రం ఘనవిజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చిత్ర దర్శకులు ఉదయ్‌శర్మ మాట్లాడుతూ కొత్త కథాంశంతో కొత్త హీరో, హీరోయిన్లతో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసే విధంగా సినిమాను రూపొందించామన్నారు. పాటలు అనంత శ్రీరామ్ రాయగా, ప్రముఖ సంగీత దర్శకులు మణిశర్మ సారధ్యంలో, ఒకటి రెండు పాటల చిత్రీకరణ మినహా సినిమా మొత్తం పూర్తయిందని, ఫిబ్రవరిలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం చిత్రబృందానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రోహిత్, నటులు నవీన్ జిపి, రచ్చరవి, నిత్య, సిమ్మి, పాల్గొన్నారు

అగ్నిప్రమాద బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలో గ్యాస్ లీక్ అయి ప్రమాదానికి గురైన బుర్రి కోటేశ్వరరావు కుటుంబాన్ని సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ఇతర నాయకులు పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ అయ్యి ప్రమాదం జరిగిందని, వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తం అవటంతో ప్రాణాపాయం తప్పిందని బాధితులు తెలిపారు. ప్రమాదం వల్ల ఇల్లు మొత్తం కాలిపోయిందని, కట్టుబట్టలతో బయట పడ్డామని వాపోయారు. నళినీకాంత్ మాట్లాడుతూ బాధిత దళిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే అర్థిక సాయం అందించి ఆదుకోవాలని, అలాగే సంబంధిత గ్యాస్ కంపెనీతో మాట్లాడి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.సత్యనారాయణ, నగర కమిటీ సభ్యులు షేక్.ఖాసింవలి, స్థానిక శాఖ కార్యదర్శి షేక్.బాషా ఉన్నారు.

బాధితుడితో మాట్లాడుతున్న నళినీకాంత్, ఇతర నాయకులు

బాల్యవివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురి సౌత్ పరిధిలోని కొప్పునూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరీ బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బాలవికాసంతోపాటు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు ఐ.వి.నాగమణి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 31న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నరసరావుపేట మండలంలోని ఎల్లమంద గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎంపీడీవో కృష్ణకుమారి అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలోనే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించారు.

జాబ్‌మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. నాలుగు కంపెనీలు వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. ఇందులో 18 మంది ఎంపికయ్యారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్.కిరణ్ నాయక్, శ్రీకాంత్, జానీ బాషా, సీడాప్ జాబ్స్ కోఆర్డినేటర్ ననిక్య నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర కానుకగా మధ్యంతర భృతి ప్రకటించాలని ఏస్టీయూ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్ టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడారు. పీఆర్‌సీ, డీఏ, ఇంతర పెండింగులో ఉన్న బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ నిర్మాణం, వార్షిక కౌన్సిల్ నిర్వహణ, భవన నిర్మాణానికి విరాళాల వసూలు తదితర అంశాలపై చర్చించారు. నాయకులు పోటు శ్రీనివాసరావు, వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లన జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'గత ప్రభుత్వంలో పారిశుధ్య కార్మికులకు ఇబ్బందులు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణాలను సుందరీకరించి, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికుల జీవన ప్రమాణాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక పండరీపురంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారని, కరోనా కష్ట కాలంలోనూ సేవలందించిన వారికి సరైన ఆదరణ లేకుండా పోయిందని తెలిపారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వీరికి సరైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశ ఆర్థిక అభివృద్ధిలో

మన్మోహన్ పాలన చెరగని ముద్ర

ప్రజాశక్తి-వెల్దుర్తి : దేశ ఆర్థిక అభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను దేశం మరువదన్నారు.

వినుకొండ : దేశాభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చెరగని ముద్ర వేశారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మన్మోహన్ మృతిపై ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మితభాషి, మృదుభాషిగానే అద్భుతాలు సాధించిన మన్మోహన్ జీవితం నేటితరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

చిలకలూరిపేట: సంక్షోభంలో చిక్కుకున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థను విజయ పథాన నడిపించిన మహా నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్

మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బేతంచర్ల రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవింద్ శంకర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనిల్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ప్రసన్న, మద్దాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాచర్ల : స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్

సేవలను పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి, కొమ్ము కోటేశ్వరరావు, షేక్ బాబు, డి.శ్రీనివాసరావు, నారాయణరెడ్డి తదితరులు గుర్తు చేసుకున్నారు.

పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, డాక్టర్ రవి శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని, మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సత్తెనపల్లి:స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త చుక్క చంద్రపాల్, పట్టణ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞాన రాజ్ పాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై సమగ్ర విచారణ

ప్రజాశక్తి -దాచేపల్లి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ చేసి, భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కుటుంబరావు తెలిపారు. మండలంలోని 13 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 113 అర్జీలను ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. శుక్రవారం ముత్యాలంపాడు గ్రామంలో సదస్సులు నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రోసూరు : మండలంలోని పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొని, ప్రజల నుంచి

అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి రైతులు మూడు అర్జీలు అందించారు. సర్పంచ్ పారుపల్లి కోటమ్మ, సర్వేయర్లు పి .శ్రీధర్, రాజ్యలక్ష్మి, వీఆర్వో రామచంద్రరావు పాల్గొన్నారు.

'వైసీపీ కార్యకర్తలపై దాడులు అమానుషం'

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కూటమి నాయకులు దాడులకు పాల్పడుతునన్నారని, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్ల బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలను, గ్రామాల్లో యాక్టివ్ పార్టీ నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని తెలిపారు. న్యాయం కోసం బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు తిరిగి ఫిర్యాదు చేసిన వారిపైనే అన్యాయంగా కేసులు పెడుతున్నారని చెప్పారు. వైసిపి ఫ్లెక్సీలు లేకుండా కూటమి నాయకులు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే..

ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల : జగన్‌మోహనరెడ్డి తన పాలనలో ప్రజలపై రూ 1.29లక్షల కోట్ల మేర విద్యుత్ భారం మోపి.. నేడు విద్యుత్ చార్జీల పెంపు అంటూ ఉద్యమాలు చేస్తూ, ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు విద్యుత్ చార్జీల పెంపు ద్వారా రూ.32,768కోట్ల భారాన్ని జగన్ మోపారని వివరించారు. ఆయన అసమర్థత వల్ల సెకీకి రూ.47,741 నష్టమని తెలిపారు. చేసిన నిర్వాకాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు నేడు ఉద్యమాలు చేస్తున్నారని.. ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్ర

ప్రగతిని అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంక్‌కు ఆకాశ రామన్న ఉత్తరాలు రాయడం.. ఇటువంటి చేష్టలను కొనసాగిస్తే తదుపరి ఎన్నికల్లో ఆయనకు సింగల్ డిజిట్ కూడా ప్రజలు ఇవ్వరని చెప్పారు.

'నిరసన పేరుతో వైసీపీ నేతల డ్రామా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసీపీ ఐదేళ్ల పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచిపోయి.. ఇప్పుడు పెంచిన ధరలు తగ్గించాలని నిరసన పేరుతో ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసిపి నేతలు చేస్తున్న నిరసనలు రాజకీయ లబ్ది కోసమేనని ఎద్దేవా చేశారు.

'జగన్ అబద్ధాల్ని జనం నమ్మరు'

ప్రజాశక్తి - వినుకొండ

మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అబద్ధాల్ని జనం నమ్మడం లేదని పోరుబాట వైఫల్యంతో మరోసారి తేలిపోయిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా పట్టుమని పదిమంది ప్రజలు కూడా వైసీపీ ఆందోళనల్లో కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి- మాచర్ల

వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి దిగబోయి, టైరు కిందకు జారిపడి, తీవ్ర గాయాలపాలైన ఓ యువకుడు మృతిచెందాడు. వెల్దుర్తి మండలం బోధలవీడు గ్రామానికి చెందిన పంగులూరి అజిత్(18) గురువారం సాయంత్రం మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి వెళ్లి, తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు మాచర్ల చేరుకున్నాడు. అక్కడ గొట్టిపాళ్ల వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కాడు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్దకు రాగానే.. కండక్టర్ ఈ బస్సు బోధలవీడుకు వెళ్లదని చెప్పడంతో హడావుడిగా దిగబోయి, కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. అర్బన్ ఎస్ఐ వి.నరసింహ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక తత్వవేత్త మన్మోహన్‌కు నివాళి

ప్రజాశక్తి - అమరావతి

మాజీ ప్రధాని, ఆర్థిక తత్వవేత్త, భారతదేశంలోకి నూతన ఆర్థిక సంస్కరణలను అమలు చేసిన పితామహుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సీపీఎం అమరావతి కమిటీ ప్రగాఢ సంతాపం తెలియజేస్తోందని నాయకులు బి.సూరిబాబు, ఎస్‌డీ మహదేవన్ తెలిపారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి నూతన సంస్కరణలు చాలా అవసరమని అనేవారని గుర్తు చేశారు. యూపీఏ -1 ప్రభుత్వంలో వామపక్షాల మద్దతుతో 2004లో భారత దేశంలో ఉపాధి హామీ పథకం, గిరిజన చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి వామపక్షాలు సూచన మేరకే అమలు చేసిన గొప్ప ప్రధానమంత్రి అని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, భిన్నత్వంలో ఏకత్వానికి కృషి చేసిన ప్రజాస్వామ్యవాదని కొనియాడారు. వారికి అరుణాంజలి తెలియజేశారు.

సంతాపం తెలిపిన మాజీ మంత్రి కాసు...

పల్నాడు జిల్లా : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని ఆయన కొనియాడారు. రెండు సార్లు ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేత్తల్లో మన్మోహన్‌సింగ్ ఒకరన్నారు. వ్యక్తిపరంగా, రాజకీయంగా ఎంతో నిజాయితీగా, నిరాడంబర జీవితాన్ని గడిపారని గుర్తు

మన్మోహన్‌తో కాసు(ఫైల్‌ఫొటో)

చేశారు. మచ్చలేని వక్తిత్వంతో ప్రత్యర్థుల మన్ననలు సైతం పొందారని తెలిపారు. గొప్ప వ్యక్తిని భారత దేశం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారు కచ్చితంగా వినియోగించుకోవాలని టీఏ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలో కార్యదర్శి ఖాజా వలి అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గుర్తించి, వాటి ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహించారు. రైతులు పంట కాల్వలు పూడిక తీయడం, పండ్ల తోట పెంపకం వంటి వాటికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అనూష పాల్గొన్నారు.

ఏఎన్‌యూ విద్యార్థులకు కార్పొరేట్ తరహా శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్స్ పొందేందుకు అవసరమైన కార్పొరేట్ విద్యాసంస్థల తరహా శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు తెలిపారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న సెమినార్ హాల్‌లో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్స్‌పై కోడ్ తంత్ర సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇన్చార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి , ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు మాట్లాడారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్‌జీఆర్ఈ నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం పెదనందిపాడులో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు జంపని రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కె.లూర్ధారెడ్డి, కార్యదర్శి ఇక్కుర్తి సాయిబాబు మాట్లాడారు. పీఆర్సీ ఎరియర్స్, డీఏ ఎరియర్స్, జిపిఎఫ్, ఈఎల్‌లు, గ్రూప్ ఇన్సూరెన్స్ రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారని, వాటిని విడతలవారీగా విడుదల చేయాలని వారు కోరారు. అనంతరం సీనియర్ సభ్యులు షేక్ శిలార్ సాహెబ్, అంగలకుదురు నాగేశ్వరరావు, పల్లెపాగ వెంకటేశ్వర్లు, టి.నాగరత్నమ్మ, డి.మల్లేశ్వరిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదనందిపాడు మండల యూనిట్ కార్యదర్శిగా బి.లక్ష్మణ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కూటమి ప్రభుత్వంలో బాదుడే బాదుడు...

విద్యుత్తు చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై వేసిందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం వైసీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుప్పరావు కాలనీలో ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చార్జీలు పెంచబోమని ప్రజలకు వాగ్దానం ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత బాదుడే బాదుడు మొదలు పెట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు, వైసిపి నాయకులు డేవిడ్ రాజు, ఎం సుధారాణి, ఆదాం,తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్తు శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు.

ప్రత్తిపాడు: విద్యుత్ చార్జీలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకులు నూనె ఉమ మహేశ్వర్ రెడ్డి అన్నారు. కరెంటు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ మల్లయ పాలెం సెంటం లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యుత్తు శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మెట్టు వెంకట అప్పరెడ్డి, ఓం ప్రకాష్ రెడ్డి, చెరుకూరి సాంబశివరావు, షేక్ ఖాసిం పీరా, గంగిరెడ్డి పరమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెనాలిరూరల్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. చెంచుపేటలోని విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ తెనాలి మున్సిపల్ ఛైర్పర్సన్ తాడిబోయిన రాధిక, పట్టణ వైసీపీ శ్రేణులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చేబ్రోలు : రాష్ట్ర ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేస్తోందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. పోరుబాటలో భాగంగా పొన్నూరు పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన రూ.15,486 కోట్ల చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చార్జీలు పెంపును నిలిపివేయాలన్నారు. ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు భద్రత : ఎస్పీ

ప్రజాశక్తి - పెదకాకాని

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెదకాకానిలోని వై జంక్షన్ వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే జరిగే అనర్థాలను కళాకారులతో ప్రదర్శింపజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులే అధికమని.. వారిలో హెల్మెట్ లేని వారు అధికంగా మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రమాదాల్లో ఎక్కువమంది తలకు దెబ్బ తగలడం వల్లే మృతి చెందుతున్నట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానాతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.వి.రమణ, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మంగళగిరి : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని పట్టణ సీఐ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

వేసవిలో గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా సంగం జాగర్లమూడి ప్లాంట్ నుండి అదనంగా నీటిని వినియోగించుకోవడానికి తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ సంగం జాగర్లమూడి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత జాగర్లమూడి ప్లాంట్ నుండి ఎంత నీరు సరఫరా జరుగుతుంది, ట్రీట్మెంట్, క్లోరినేషన్, ఫిల్టర్ బెడ్స్ వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో గుంటూరు నగరానికి సరిపడా త్రాగునీరు సరఫరా చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్లాంట్‌లో ఏమైనా మరమ్మతులు ఉంటే పరిశీలించి, యుద్ధప్రాతిపదికన చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ని పరిశీలించి, స్టోరేజ్ కెపాసిటి తెలుసుకొని ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ల్యాబ్‌లో నీటి నాణ్యతను పరిశీలించి, శ్యాంపిల్స్‌ని నిర్దేశిత ప్రమాణాల మేరకు పరిశీలించాలని, ప్రతిరోజు శ్యాంపిల్స్ ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పర్యటనలో యస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిఈఈ హనీఫ్, ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి,పెదనందిపాడు

మండలంలోని అన్నపర్రు, కొప్పర్రు, నందిపాడు, ఏబీ పాలెం, జి జి పాలెం గ్రామ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం టిడిపి ఎన్నారై నాయకులు ఆళ్ల వెంకట్, ఆళ్ల భాస్కరరావు, ఎంఈఓ ముద్దన శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంటుపల్లి అప్పారావు, జాగర్లమూడి శివయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి, పెదనందిపాడు

క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం, పెదనందిపాడు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు, బాల, బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పెదనందిపాడు మాజీ ఎంపీపీ ముద్దన నాగ రాజకుమారి, పిఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య , ఎంఈఓ ముద్దన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు,ఆటలూముఖ్యమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు తదితరుల పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ఉద్యోగులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-మంగళగిరి

సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎన్టీయూసీ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార బ్యాంకులలో వేతన సవరణ, ఉద్యోగుల పదోన్నతులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సుంకర శ్రీనివాసన్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో వార్షిక వేడుకల నిర్వహణ

ప్రజాశక్తి - మేడికొండూరు

ఎటువంటి అవాంఛనీయ ఘటనలకూ తావు లేకుండా అహ్లాదకర వాతావరణంలో వార్షిక వేడుకలను నిర్వహించుకోవాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ సిరిపురం గ్రామపెద్దలకు సూచించారు. సిరిపురం గ్రామంలోని బాలయేసు నామకరణ దేవాలయంలో జనవరి 1న వార్షిక వేడుకలు జరగనున్న నేపథ్యంలో దేవాలయ కమిటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. ఫాదర్ ఎస్.వి.థామస్ రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు ఏరువ సౌరెడ్డి, జోసఫ్ రెడ్డి,పసల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పెదకాకాని

తెలుగుదేశం పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికీ తాను అండగా ఉంటానని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పెదకాకానిలో ఇటీవల మృతి చెందిన కార్యకర్తలు షేక్ బాజీ, దానబోయినవెంకట నారాయణ, ఉయ్యూరు నాగయ్య, తోటకూర సలోమి, ఉయ్యూరు నాగ లీలాకుమారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, దర్శి భాస్కరరావు, కాజా అంకమ్మరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై నేడు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు
కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలపై రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో నేడు సాయంత్రం 6 గంటలకు స్థానిక బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. హాజరైన వారికి ఈ పుస్తకం ఉచితంగా అందజేయటం జరుగుతుందని, కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సన్ కోఆర్డినేటర్ యశ్వంత్ కోరారు. ఇతర వివరాల కోసం 94948085899 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. సిసిటివి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించి పరికరాలపై ఎక్స్‌పైరీ తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇవియంల భద్రత విషయంలోరాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ లో వివిప్యాట్స్ భద్రపరచిన గోడౌన్ ను ఆర్‌డిఓకే. శ్రీనివాసరావు తనిఖీ చేశారు. డిఆర్ఒ షేక్.ఖాజావలి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్స్‌మైండ్స్‌కు మొదటి ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు
ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు గురువారం ప్రకటించిన సి.ఎ.ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థి రిషబ్ ఓత్స్‌వాల్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించాడని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు.శుక్రవారం బ్రాడీపేటలోని విద్యాసంస్థల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రిషబ్‌తోపాటు, ప్రకటించిన మొదటి 50 ర్యాంకులలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 4 ఆలిండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. వివిధ కామర్స్ కోర్సులలో మాస్టర్‌మైండ్స్‌కు ఇప్పటి వరకూ 50 సార్లకుపైగా ఫస్ట్ ర్యాంకు వచ్చిందని, ఈ ర్యాంకుల క్రెడిట్ పూర్తిగా విద్యార్థులకే దక్కుతుందన్నారు. ఇంతటి మంచి ఫలితాలు సాధనకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

ఆర్‌విఆర్‌లో కొలరిడో-2024 ఘనంగా ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు
వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు ఆధునిక కోర్సులతో పాటు, సాంకేతిక పరిశోధనలవైపు దృష్టి సారించాలని టిసిఎస్ సీనియర్ కన్సల్టెంట్, డెలివరీ పార్టనర్ ఎం.ఎస్.ఆర్.మూర్తి అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులపాటు 'కొలరిడో-2024' పేరుతో నిర్వహించే నేషనల్ లెవల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్ శుక్రవారం మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో విద్యార్థికి ఉద్యోగాల చేరువకు టెక్నికల్ స్కిల్స్‌తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని తెలియజేశారు. ఎల్‌వైఎఫ్ ఫేమ్ హీరో, హీరోయిన్ శ్రీహర్ష, కిషికా కపూర్ మాట్లాడుతూ భవిష్యత్‌ను నిర్ణయించేది యువతరమేనని, చలన చిత్రాల్లో మంచి సందేశాన్ని మాత్రమే యువత స్వీకరించాలన్నారు. విద్యార్థులు అంకుర పరిశ్రమల స్థాపన దిశగా కృషి చేయాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ప్రసంగించారు. కళాశాల ప్రాంగణంలో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గోపిచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకలను ప్రారంభిస్తున్న మూర్తి తదితరులు

విజ్ఞాన్ వర్సిటీలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు
దేశానికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సేవలు ఎనలేనివని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

సంతాప సభలో పాల్గొన్న లావు రత్తయ్య, కృష్ణదేవరాయలు, వీసీ, తదితరులు

ఎంఎస్ఎంఇ పార్క్‌కు స్థలం గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు
జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్, క్లస్టర్ డెవలప్మెంట్ ప్రాజెక్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్, క్లస్టర్ డెవలప్మెంట్ ప్రాజెక్టులకు అవసరమైన స్థలాలు గుర్తించాలన్నారు. పరిశ్రమల శాఖ ఏపీఐఐసీతో పాటు, అనుబంధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్‌విండో ద్వారా అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులతోగా అనుమతులు మంజూరు చేసేలా పరిశ్రమల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్‌క్లస్టర్, హ్యాండ్లూమ్ క్లస్టర్ డిపిఆర్‌లు సిద్ధం చేసి అనుమతులు మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాయితీలు అందిస్తున్న పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ శాఖ అనుమతులు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 26 క్లైయిమ్స్ కు రూ.2,38,27,930 మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ.జయలక్ష్మి, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బి. హిజ్జా మనోరమ, ఏపీఎస్ఎఫ్‌సి మేనేజర్ అజిత, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, ఏపిపిసిబి ఈఈ ఎండి నజీనా బేగం వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

చిప్స్ కాలేజీలో జాతీయ సైంటిఫిక్ ఛాలెంజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు
చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి సంయుక్తంగా ఫార్మాథాన్ 2024, ప్రోటోటైప్ ఛాలెంజ్ పేరుతో ఆన్‌లైన్ విధానంలో సైంటిఫిక్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి రాయపాటి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర, ఆర్‌విఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, ఆర్గ్ ఈనెస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్ర కె వర్మ, ఐటిబిఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవిపి చంద్రశేఖరరావు, డాక్టర్ రాధిక సజ్జ, పివిఎంఎస్ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన గాల్గోసియస్ యూనివర్సిటీ ప్రథమ బహుమతి, ఆర్‌విఆర్ అండ్ జెసి ద్వితీయ బహుమతి, ఎస్ఆర్‌ఐపి కాలేజ తృతీయ బహుమతి గెలుపొందగా వారికి నగదు బహుమతి అందచేశారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

అమిత్‌షా రాజీనామా కోసం 30న నిరసనలు

జయప్రదం చేయాలని వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 30వ తేదీన గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐయం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరావు, సిపిఐ(ఎంఎల్) ప్రజాపోరు జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి నేతలకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పట్ల గౌరవం లేదని ఈ వ్యాఖ్యల ద్వారా మరోసారి నిరూపితం అయ్యిందన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిషా అవమానకరంగా మాట్లాడారన్నారు. తప్పుని చెప్పాల్సిన ప్రధాని మోడీ అమిత్‌షాను వెనకేసుకొస్తున్నారని అన్నారు. తక్షణమే అమిత్‌షా రాజీనామా చేయాలన్నారు. గుంటూరులో 30న ఉదయం 10 గంటలకు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని వామపక్షాల నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఐ పట్టణ ఇంచార్జ్ కార్యదర్శి ఏ ప్రభాకర్, సిపిఐ ఎంఎల్ నాయకులు కె కోటేశ్వరావు, సిపిఎం మంగళగిరి మండల రూరల్ కార్యదర్శి యు దుర్గారావు, సిపిఐ మంగళగిరి మండల రూరల్ కార్యదర్శి జె జాన్ బాబు మాట్లాడుతూ అమిత్ షా వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 30వ తేదీన జరిగే కార్యక్రమానికి ప్రజాతంత్ర వాదులు, లౌకికవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, సిపిఐ నాయకులు చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరావు, జి అజయ్ కుమార్, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఈ కాటమరాజు, ఎన్ వెంకటేశ్వరావు, జె వెంకటేష్ పాల్గొన్నారు.

గుంటూరు సిపిఐ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు